ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
5

పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
శుక్రవారం 8 ఆగస్టు 2025

నిర్వహణ లేక.. షెడ్లు శిథిలావస్థకు చేరి
- క్రయవిక్రయదారులకు తప్పని అవస్థలు
- ఇదీ దుగ్గేరు వారపు సంతలో పరిస్థితి

8లో

ఈ కాలనీలు..


లుంబూరులోని జగనన్న కాలనీలో రోడ్డు ఇలా..

సమస్యల లోగిళ్లు

- కానరాని సిమెంట్ రోడ్లు, కాలువలు
- ఇళ్ల మధ్య నిలుస్తున్న వరద
- చాలాచోట్ల అసంపూర్తిగా నిర్మాణాలు
- డంపింగ్‌యార్డుగా స్థలాలు

పాలకొండ, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జగనన్న కాలనీలు సమస్యలకు కేరాఫ్‌గా నిలుస్తున్నాయి. కనీస మౌలిక వసతులకు నోచక అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిధుల దుర్వినియోగం తప్ప ఆయా ప్రాంతాలు కనీస ప్రగతికి నోచుకోలేదు. గెడ్డలు, కొండవాగులు, శ్మశానవాటికలు, చెరువులు, అటవీ ప్రాంత సమీపంలో, నివాసయోగ్యం కాని సుదూర ప్రాంతాల్లో గత ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మం జూరు చేసింది. మరోవైపు మంజూరు చేసిన నిధులు చాలక చాలామంది లబ్ధిదారులు గృహ నిర్మాణాలకు ఆసక్తి చూప లేదు. పేదలకు ఇళ్లు కట్టించి ఇస్తామన్న నాటి ప్రభుత్వం మాట మార్చే సింది. జగనన్న కాలనీల పేరిట ఊర్లు ఏర్పాటు చేస్తామని ప్రకటనలకే పరిమితమైంది. వాటి అభివృద్ధిపై దృష్టి సారించక పోవడంతో ప్రస్తుతం జగనన్న కాలనీలు అడవిని తలపిస్తున్నాయి.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో పార్వతీపురం, సాలూరు, మున్సిపాలిటీతో పాటు పాలకొండ నగర పంచాయతీ, పలు మండలాల్లో గ్రామీణ ప్రాంత ప్రజలకు నాటి వైసీపీ సర్కారు ఇళ్ల స్థలాలు మంజూరు చేసింది. అయితే పట్టణానికి శివారు ప్రాంతంలో ఉండడంతో ఆ కాలనీల్లో గృహ నిర్మాణాలకు ఎవరూ ఆసక్తి చూపలేదు. అధికారుల ఒత్తిడితో అతికొద్దిమంది మాత్రమే అప్పులు చేసి పనులు చేపట్టారు. అయినప్పటికీ చాలా ఇళ్లు వివిధ దశల్లోనే నిలిచిపోయాయి. తాగునీరు, కాలువలు, రోడ్లు తదితర వసతులు లేకపోవడంతో లబ్ధిదారులు అక్కడ ఉండేందుకు ఇష్టపడడం లేదు.

పాలకొండలో ఇలా..

పాలకొండ పట్టణ ప్రజల కోసం పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న లుంబూరు ప్రాంతంలో ఇళ్ల స్థలాలు మంజూరు

(మిగతా 8వ పేజీలో..)


వెలగవాడలో లబ్ధిదారులకు కేటాయించిన స్థలాల్లో చెత్త వేసిన దృశ్యం

గిరిజన విద్య మిథ్య

- పూర్తిస్థాయిలో లేని ఉపాధ్యాయులు
- కొన్నిచోట్ల ఆఫీస్ సబార్డినేటర్లు, వలంటీర్లతోనే బోధన
- ఐదు తరగతుల విద్యార్థులను ఒకేచోట కూర్చోబెడుతున్న వైనం
- కొత్త పాఠశాలల ఏర్పాటు ఊసేలేదు
- సుదూర ప్రాంతాలకు నడిచి వెళ్లి చదువుకుంటున్న పిల్లలు
- ప్రభుత్వం స్పందించాలని అడవి బిడ్డల విన్నపం


పీటీ మండ పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు చెబుతున్న ఆఫీసు సబార్డినేటర్ రాజేష్

కురుపాం (జియ్యమ్మవలస), ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యాభివృద్ధిని అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారు. గిరిజన పాఠశాలల్లో అవసరమైన ఉపాధ్యాయులను నియమించడంలో తాత్సారం చూపుతున్నారు. చాలా పాఠశాలల్లో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఆఫీస్ సబార్డినేటర్లు, వలంటీర్లే గురువుల అవతారం ఎత్తుతున్నారు. ఐదు తరగతుల విద్యార్థులను ఒకేచోట కూర్చోబెట్టి బోధన అందిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో చదువుకున్న పిల్లలు ఉన్నా పాఠశాలలు లేవు. కొత్త స్కూళ్ల ఏర్పాటు ఊసే లేదు. ఎక్కడో కిలోమీటర్ల సుదూరంలో ఉన్న పాఠశాలలకు నడిచి వెళ్లి విద్యార్థులు చదువుకుంటున్న పరిస్థితి నెలకొంది. ఫలితంగా గిరిజన బోధన మిథ్యగా మారింది.

ఇదీ పరిస్థితి..

- జియ్యమ్మవలస మండలం పీటీ మండ పంచాయతీ కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 92 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో 31 మంది బాలికలు, 61 మంది బాలురు ఉన్నారు. ప్రస్తుతం పాఠశాలలో 7వ తరగతి వరకే ఉంది. ఇక్కడ కె.సుగ్రీవులు ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులుగా, వై.అప్పలనర్సమ్మ ఎస్‌జీటీగా, సవర భాష వలంటీరుగా కొండ్రొ్రి జ్యోతి, ఆఫీసు సబార్డినేట్‌గా కె.రాజేష్ పని చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతీ 20 మందికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలి. ఈ లెక్కన ఇక్కడ నలుగురు ఎస్‌జీటీలు, ఒక ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం ఉండాలి. కానీ, ఇక్కడ ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం, ఒక ఎస్‌జీటీతోనే పాఠశాలను నడుపుతున్నారు. వీరు లేని సమయంలో ఆఫీస్ సబార్డినేట్ రాజేష్, సవర భాష వలంటీరు జ్యోతి ఉపాధ్యాయ అవతారమెత్తి విద్యార్థులకు బోధిస్తున్నారు. అన్ని తరగతుల విద్యార్థులను ఒకేచోట కూర్చోబెట్టి పాఠాలు చెబుతున్నారు.
- టీకే జమ్ము పంచాయతీ కూటం గ్రామంలో 15 మంది గిరిజన విద్యార్థులు ఉన్నారు. ఈ గ్రామంలో పాఠశాలను (మిగతా 8వ పేజీలో..)


పీటీ మండ పాఠశాలలో ఐదు తరగతుల విద్యార్థులకు ఒకేచోట బోధిస్తున్న సవర భాష వలంటీరు జ్యోతి

నేడు అడవి తల్లికి ప్రథమ పూజ

- గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాట్లు
- సారె అందించనున్న ఐటీడీఏ పీవో

పార్వతీపురం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా పార్వతీపురం ఐటీడీఏలోని అడవితల్లి విగ్రహానికి శుక్రవారం ప్రథమ పూజలు జరగనున్నాయి. గిరిజన సంఘాల ఆధ్వర్యంలో సంప్రదా యబద్ధంగా పూజలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాత్సవ అడవి తల్లికి సారెను అందించనున్నా రు. ముందుగా అడవితల్లికి అధికారులు, గిరిజన సంఘాల నాయకులు తదితరులు పాలాభిషేకం నిర్వహించనున్నారు. అనంతరం గిరిజన సంస్కృతి, సంప్రదాయాల ప్రకారం అడవితల్లి చుట్టూ ప్రదర్శనలు నిర్వహించనున్నారు . కన్నుల పండుగగా పూజలు నిర్వహించి అడవి బిడ్డలు పాటలు పాడనున్నారు.


అడవితల్లి విగ్రహం

సిఫారసుకు చెల్లు.. ప్రతిభకు పట్టం
- ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపికకు మార్గదర్శకాలు
- నేటితో ముగియనున్న దరఖాస్తు అవకాశం
- తొలిసారిగా ఇంటర్వ్యూలతో ఎంపిక ● 21 నుంచి 23 వరకు ఇంటర్వ్యూలు

6లో

నాయీ బ్రాహ్మణులకు చేయూత
- నెలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్

6లో

పెచ్చులూడి.. పెను ప్రమాదం తప్పి
- రామభద్రపురం పశువైద్య కేంద్రంలో భయాందోళనకు గురైన సిబ్బంది

6లో

తల్లిపాలతోనే శిశువుకు ఆరోగ్యం

- మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

సాలూరురూరల్ (సాలూరు), ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): తల్లిపాలతోనే శిశువుకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. తల్లిపాల వారోత్సవాల ముగింపు సభను సాలూరులో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి సంధ్యారాణి హాజరై మాట్లాడారు. 'తల్లిపాలలో శిశువు ఎదుగుదలకు కావాల్సిన అన్ని పోషకాలు ఉంటాయి. పుట్టిన 30 నిమిషాల్లో శిశువుకు తల్లిపాలు అందించాలి. దీనివల్ల పిల్లలు డయేరియా, నిమోనియా వంటి వ్యాధుల బారినపడకుండా ఉంటారు. 6 నెలల వరకు బిడ్డలకు తల్లిపాలు ఇవ్వాలి. ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు తల్లిపాలపై అవగాహన కల్పించాలి. బాల సంజీవని పేరిట బిడ్డలకు బాలామృతం ఇప్పటికే అందిస్తున్నాం. ప్రతీ బస్టాండ్, ప్రభుత్వ కార్యాలయంలో తల్లి పాలు ఇవ్వడానికి ప్రత్యేక గదులు ఏర్పాటు చేయాలి.' అని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

'తోటపల్లి'కి తగిన ప్రాధాన్యం కల్పిస్తాం

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

గరుగుబిల్లి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): తోటపల్లి వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి తగిన ప్రాధాన్యత కల్పిస్తామని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. గురువారం తోటపల్లి దేవస్థానం పరిధిలో ఆలయాల అభివృద్ధి సేవా ట్రస్ట్, దేవాదాయ ధర్మాదాయశాఖలు సంయుక్తంగా నూతనంగా నిర్మించిన వానప్రస్థాశ్రమం, అన్న ప్రసాద సత్రాలను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'స్వామి వారికి నేను ప్రధాన భక్తుడిని. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించక ముందే తోటపల్లి వేంకటేశ్వరస్వామి ప్రాముఖ్యతను తెలుసుకున్నా. చినతిరుపతిగా ప్రసిద్ధిగాంచిన తోటపల్లికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు అభివృద్ధి సేవా ట్రస్ట్ ప్రతినిధులు, దేవాదాయ ధర్మాదాయశాఖలు ప్రత్యేక కృషి చేయడం అభినందనీయం. గతంలో అభివృద్ధికి దూరంగా ఉంది. ప్రస్తుతం ఏడాదిలోనే దేవస్థానం రూపురేఖలు మారాయి. దేవస్థానం ప్రాంగణానికి అనుకుని గోశాల నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని, నిధులు మంజూరు చేశాం. దేశీయ ఆవులను సంరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి.' అని అన్నారు. అనంతరం ఆలయ అభివృద్ధికి సుమారు రూ.40 లక్షలు విరాళం అందించిన ఖడ్గవలసకు చెందిన కిమిడి శ్రీరామ్మూర్తి, రూ.13.5లక్షలు అందించిన కుదమ గ్రామానికి చెందిన కె.చంద్రశేఖర్, ఎస్.సుభద్రమ్మ, గంట కృష్ణంనాయుడు తదితర దాతలను కలెక్టర్ సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ, అభివృద్ధి సేవా ట్రస్ట్ ప్రతినిధులు డి.పారినాయుడు, డి.ధనుంజయరావు, సర్పంచ్ ఆవాల సింహాచలం, ఎంపీటీసీ సభ్యులు ఎం.సింహాచలంనాయుడు, యమల శ్రీనివాసరావు, ఎస్ఐ పి.రమేష్ నాయుడు, ఆలయ ప్రధాన అర్చకులు వీవీ అప్పలాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.


అన్న ప్రసాద సత్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

విద్యాప్రమాణాలు మరింత పెరగాలి

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం ద్వారా వారిలో జ్ఞానాన్ని, నైపుణ్యాలను పెంచవచ్చునని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ అన్నారు. విద్యా ప్రమాణాల పెంపుపై గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు మరింత పెరగాలని, అందుకు తగిన ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని విద్యాశాఖాధికారులకు దిశా నిర్దేశం చేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా బోధనలో కూడా మార్పులు రావాలని, ఇందుకు ఉపాధ్యాయులకు శిక్షణ అవసరమన్నారు. ప్రతి సబ్జెక్టుపై శిక్షణ తీసుకోవాలన్నారు. లక్ష్యాలు నిర్దేశించుకొని అందుకు అనుగుణంగా పనిచేయాలని, లేదంటే చర్యలు తప్పవని అన్నారు. ప్రతి పాఠశాలలో మౌలిక వసతులతో పాటు విద్యార్థులకు తగిన విధంగా ఉపాధ్యాయులు ఉండాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన విద్యార్థులకు బోధించేందుకు లాంగ్వేజ్ పండిట్లను నియమించాలని అన్నారు. ఎప్పటికప్పుడు వైద్య సిబ్బందితో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి బి.రాజకుమార్, సమగ్ర శిక్ష అదనపు పథక సమన్వయకర్త ఆర్.తేజేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్చకుడి నివాసం కోసమని చెప్పి..
- కోమటిచెరువు గట్టుపై అక్రమ నిర్మాణం
- దుకాణాలుగా మార్చి.. వేలం వేసిన వైనం

7లో


జనాలతో కిటకిటలాడుతున్న పార్వతీపురం మార్కెట్

శ్రావణ శోభ

- కిటకిటలాడిన మార్కెట్లు ● నేడు వరలక్ష్మీవ్రతం

పాలకొండ/మక్కువ/వీరఘట్టం(పాలకొండ),సాలూరురూరల్/బెలగాం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌కు శ్రావణ శోభ సంతరించుకుంది. శుక్రవారం నిర్వహించే వరలక్ష్మీ వ్రతం కోసం అవసరమైన పూజా సామగ్రి, దుస్తులు, పూలు, పండ్లు, బంగారం కాసు తదితర వాటిని కొనుగోలు చేసేందుకు వచ్చిన వారితో పాలకొండ, పార్వతీపురం, సాలూరు, వీరఘట్టం, మక్కువ, కురుపాం తదితర మండలాల్లోని ప్రధాన మార్కెట్లు గురువారం రద్దీగా మారాయి. పూజా సామగ్రి, పండ్లు, పూలు ధరలు అధికంగా ఉండడంతో కొనుగోలుదారులు బెంబేలెత్తిపోయారు. డజను చామంతి పూలు రూ.50, డజను గులాబీలు రూ.50, ఐదు బంతి పూలు రూ.30కి వ్యాపారులు విక్రయిం చారు. ఇక పండ్ల విషయానికి వస్తే యాపిల్, దానిమ్మ కిలో రూ.300, జామి, ద్రాక్ష కిలో రూ.200 దాటి విక్రయించారు. డజను అరటిపండ్లు సైజును బట్టి రూ.80 నుంచి రూ.150 వరకు అమ్మకాలు చేశారు. ప్రధానంగా లక్ష్మీదేవి ప్రతిమ గల కాసులను మహిళలు కొనుగోలు చేశారు.


పాలకొండ మార్కెట్‌లో పండ్లను కొనుగోలు చేస్తున్న మహిళలు


కిటకిటలాడుతున్న విజయనగరం మార్కెట్

- ఆకాశంలో పండ్లు, పూల ధరలు
- బంగారు, వెండి, వస్త్ర దుకాణాల్లో రద్దీ

శ్రావణ శోభ

విజయనగరం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): జిల్లా శ్రావణ శోభ సంతరించుకుంది. నేడు శ్రావణ శుక్రవారం కావడంతో వరలక్ష్మీ వ్రతాలకు మహిళలు సిద్ధమవుతున్నారు. ఈ వ్రతానికి హిందూ సంప్రదాయంలో ఎంతో ప్రాముఖ్యం ఉంది. సంపద, ఆరోగ్యం, కుటుంబ శ్రేయస్సు, సౌభాగ్యాలను ఆకాంక్షిస్తూ వరలక్ష్మీ దేవిని పూజిస్తారు. పూజా సామగ్రి కొనుగోలుదారులతో మార్కెట్లు రద్దీగా మారాయి. శ్రావణ మాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరిస్తారు. ఇదిలా ఉండగా.. శ్రావణ శుక్రవారం సందర్భంగా జిల్లాలోని వివిధ దేవాలయాల్లో భక్తుల దర్శనాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. విజయనగరంలోని మూడులాంతర్లు వద్ద ఉన్న చదురుగుడి, రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న వనంగుడి, సంతోషిమాత ఆలయం, కన్యకాపరమేశ్వరీ ఆలయం, జ్ఞానసరస్వతి ఆలయం, బాబామెట్టలోని దుర్గాదేవి ఆలయం, దాసన్నపేటలోని దుర్గాదేవి ఆలయంతోపాటు పలు ఆలయాల్లో శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరగనున్నాయి.

రద్దీగా మార్కెట్లు..

వరలక్ష్మీ వ్రతానికి అవసరమైన పూజాసామగ్రి, ప్రసాదాల తయరీ దినుసులు కొనుగోలు చేసేందుకు వచ్చిన వారితో విజయనగరం మార్కెట్లు గురువారం రద్దీగా కనిపించాయి. అలాగే జిల్లాలోని అన్ని బంగారం దుకాణాల్లో పండుగ కళ సంతరించుకుంది. ధరతో నిమిత్తం లేకుండా సెంటిమెంట్‌గా లక్ష్మీదేవి ప్రతిమను తీసుకుంటున్నారు. గత ఏడాది గ్రాము ఆర్నమెంట్ బంగారం దర రూ.6,500 పలుకగా, ఈ ఏడాది రూ.9,300కి చేరింది. తరుగు, మేకింగ్ చార్జీలతో కలిపి గ్రాము ప్రతిమ రూ.9,600 అవుతుంది. అదే అర గ్రాము లక్ష్మీదేవి ప్రతిమ రూ.5వేల వరకు పలుకుతోంది. ఎక్కువగా ఇవే అమ్ముడవుతున్నాయి.


అమ్మవారి పూజ కోసం గాజులను కొనుగోలు చేస్తున్న మహిళలు

సిఫారసుకు చెల్లు.. ప్రతిభకు పట్టం

- ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపికకు మార్గదర్శకాలు
- నేటితో ముగియనున్న దరఖాస్తుల గడువు
- తొలిసారిగా ఇంటర్వ్యూలతో ఎంపిక
- 21 నుంచి 23 వరకు ఇంటర్వ్యూలు

విజయనగరం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు అవార్డులకు గతంలో సిఫారసులకు ప్రాధాన్యం ఉండేది. క్షేత్రస్థాయిలో ఎంతో కష్టబడి.. ప్రతిభను చాటిన ఉపాధ్యాయులు అవార్డులకు దూరంగా ఉండేవారు. అలాంటి వారిని గుర్తించి.. వారి ప్రతిభే కొనమానంగా ఉత్తమ అవార్డుల ఎంపికకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఏటా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురష్కరించుకుని సెప్టెంబరు 5న దేశవ్యాప్తంగా గురుపూజోత్సవాన్ని ఓ పండుగగా జరుపుకుంటాం. ఈ సందర్భంగా గురువులను సన్మానించుకుంటాం. భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతున్న వారిని జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి పురస్కారాల ఎంపికకు సంబంధించి ఇప్పటివరకు ఉన్న విధానాన్ని ప్రభుత్వం మార్చింది. ఇందుకు సంబంధించి 100 పాయింట్లకు 17 అంశాలను పరిగణలోకి తీసుకోనుంది. అంతేగాక ఇంటర్వ్యూలను ప్రవేశపెట్టింది.

మూడు రకాల దరఖాస్తులు..

- ఉపాధ్యాయులుగా పదేళ్ల సర్వీసు పూర్తి చేసిన వారు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. సాధించిన విజయాలు, నూతనావిష్కరణలో విద్యార్థుల ప్రగతి.. సమాజం, పాఠశాల ప్రగతికి చేసిన కృషిని వివరిస్తూ తగు ఆధారాలతో దరఖాస్తు చేసుకోవాలి.
- రెండో అంశంగా కొంతమంది టీచర్లు వెలకట్టలేని సేవలు అందిస్తున్నా అవార్డుల కోసం దరఖాస్తు చేసుకోరు. పొగడ్తలు, గొప్పలు చెప్పుకోవడం ఇష్టం ఉండదు. అటువంటి టీచర్లను గుర్తించి కనీసం ఐదుగురు తమ సహచర టీచరు గురించి దరఖాస్తు చేస్తే వాటిని పరిగణనలోకి తీసుకుంటారు.
- మూడో అంశంగా సమస్త సేవలే, లీప్ యాప్‌ల అంశాలను పరిశీలించి ప్రభుత్వమే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికకు 100 పాయింట్లలో 17 అంశాలను పరిగణనలోకి తీసుకుంటుంది. పాయింట్లు ఎక్కువ సాధించిన వారిని ఎంపిక చేస్తుంది.

21 నుంచి 23 వరకు ఇంటర్వ్యూలు..

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపిక కోసం ఈఏడాది కొత్తగా ఇంటర్వ్యూలను ప్రవేశపెట్టారు. గత ఏడాది వరకు టీచర్లు దరఖాస్తుల్లో చేసుకున్న అంశాలను మాత్రమే పరిశీలించేవారు. ప్రస్తుతం 100 ప్రతిభ పాయింట్లతో పాటు ఇంటర్వ్యూలో కూడా ప్రతిభ చూపిన వారినే రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేస్తారు. విద్యా డివిజన్, జిల్లా స్థాయిలో ఉత్తములుగా ఎంపికై రాష్ట్ర స్థాయికి వెళ్లిన వారిని వారి ప్రతిభా పాఠశాల ఆధారంగా అవార్డులకు ఎంపిక చేస్తారు. ఆసక్తి గల టీచర్లు ఈ అవార్డులు కోసం దరఖాస్తు గడువు ఈనెల 8 అంటే శుక్రవారం ముగియనుంది.

పాయింట్లు ఇలా..

ఉపాధ్యాయుల ఉన్నత విద్యార్హతలకు 2 పాయింట్లు, సర్వీసుకు 6 పాయింట్లు, టీచర్ సబ్జెక్టులో ఉత్తీర్ణత శాతానికి పది, తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సంఘ కార్యకలాపాల్లో భాగస్వామ్యానికి 2, విద్యార్థి ప్రమాణాల పెంపునకు చేసిన కృషికి 5 పాయింట్లు కేటాయించారు.


శిక్షణ కేంద్రంలోని పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్‌జిందాల్

పోలీసు శిక్షణ కేంద్రంలో వసతులు కల్పించాలి

- ఎస్పీ వకుల్‌జిందాల్

విజయనగరం క్రైం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సారిపల్లిలో గల పోలీసు శిక్షణ కేంద్రంలో అన్ని మౌలిక వసతులు కల్పించాలని ఎస్పీ వకుల్ జిందాల్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన పోలీసు శిక్షణా కేంద్రాన్ని సందర్శించారు. తరగతి గదులను, పరేడ్ గ్రౌండ్, ఫైరింగ్ రేంజ్, వాటర్ ప్లాంట్, వంటగది, డైనింగ్ హాల్స్, కేంద్రంలోని పరిసరాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. సుమారు 150 మంది ట్రైనీ కానిస్టేబుల్స్ త్వరలో శిక్షణకు రానున్నందున ఎటువంటి ఇబ్బందులు ఎదురుకాకుండా వసతులు కల్పించాలని సూచించారు. శిక్షణ పొందేందుకు అవసరమైన నిర్మాణాలను గతంలోనే చేపట్టారని చెప్పారు. తాగునీటి సమస్య తలెత్తకుండా నగరపాలక సంస్థ అధికారులతో, ఇతర ఉన్నతాధికారులతో మాట్లాడి, చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీ వెంట ఏఎస్పీలు సౌమ్యలత, జి.నాగేశ్వరరావు, ఎస్‌బీ సీఐ లీలారావు, సీఐలు రామకృష్ణ, లలిత, ఆర్ఐ గోపాలనాయుడు, ఎస్ఐ గణేష్, డీటీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



గాయత్రీమాతకు పసుపుకొమ్ములతో అలంకరణ

రాజాం రూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాయత్రీ మాత ఆలయంలో గల అమ్మవారిని గురువారం భక్తులు సమర్పించిన పసుపుకొమ్ములతో అలంకరించారు. శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని ప్రత్యేక అలంకరణ చేసినట్టు ప్రధాన అర్చకుడు వాసా జగదీశ్వరశర్మ తెలిపారు. భక్తులతో పూజలు చేయించారు.

నాయీ బ్రాహ్మణులకు చేయూత

- నెలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్
- జిల్లాలో 5వేల మందికి పైగా లబ్ధి

రాజాం రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణులకు కూడా కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. సొంతంగా సెలూన్‌షాపులు నిర్వహిస్తున్న వారికి ప్రభుత్వం తీపికబురు చెప్పింది. ప్రస్తుతం హెయిర్ కటింగ్ సెలూన్‌లకు అమలవుతున్న 150 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను 200 యూనిట్లకు పెంచుతూ ప్రభుత్వం తాజాగా నిర్ణయం తీసుకుంది. దీంతో జిల్లాలో ఇదే వృత్తిని నమ్ముకుని జీవనోపాధి సాగిస్తున్న 5వేల మందికి పైగా నాయీ బ్రాహ్మణులకు లబ్ధి చేకూరనుంది. ఈనెల 6న క్యాబినెట్‌లో తీసుకున్న ఈ నిర్ణయంతో ఆయావర్గాలలో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి.

ఎంతో ఉపయోగం..

ప్రభుత్వం తాజాగా ప్రకటించిన ఉచిత విద్యుత్ రాయితీ చాలామంది మధ్యతరగతి సెలూన్ నిర్వాహకులకు లాభంగా మారనుంది. నాది అంతకాపల్లి. 20 ఏళ్లుగా రాజాం మెయిన్‌రోడ్‌లో సెలూన్ నిర్వహిస్తున్నాను. పాత పద్ధతుల్లోనే వృత్తిని కొనసాగిస్తున్నాను. రాజాంలాంటి చిన్న పట్టణంలో కూడా అత్యాధునిక సౌకర్యాలతో బ్యూటీపార్లర్లు ఏర్పాటవుతున్నాయి. యువత అలాంటి వాటివైపే మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా మా ఉపాధి తగ్గుముఖం పడుతోంది. నెలవారీ అద్దెలు, ఇతరత్రా ఖర్చులు భారంగా మారుతున్న పరిస్థితుల్లో ప్రభుత్వం ఉచిత విద్యుత్ ఇవ్వాలని ప్రకటించడం చాలా సంతోషం.

-నారాయణరావు, సెలూన్, రాజాం

వాహనచోదకులు అప్రమత్తంగా ఉండాలి

- బీఎన్ఎస్ ప్రకారం పెరిగిన జరిమానా, జైలు శిక్ష: బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డి

బొబ్బిలి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రవాణా, ట్రాఫిక్ నిబంధనలకు సంబంధించి కొత్తగా అమలుల్లోకి వచ్చిన బీఎన్ఎస్ చట్టాల నిబంధనలు కఠినంగా ఉండడంతో వాహనచోదకులు అప్రమత్తంగా ఉండాలని బొబ్బిలి డీఎస్‌పి భవ్యారెడ్డి సూచించారు.గురువారం బొబ్బిలిలో సీఐ కటకం సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఆటోలు, లారీల డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భవ్యారెడి మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి గతంలో స్వల్ప మొత్తాలతో జరిమానాలు ఉండేవని, ప్రస్తుతం ఆ జరిమానా మొత్తాలు చాలా ఎక్కువగా పెరిగాయని చెప్పారు. బీఎన్ఎస్ చట్టం సెక్షన్ 285 ప్రకారం 200 ఉండే జరిమానాలు రూ.ఐదు వేలుకు, జైలు శిక్ష ఐదు నుంచి పది సంవత్సరాల వరకు పడుతున్నాయని తెలిపారు. సీఐ సతీష్‌కుమార్, ట్రాఫిక్ ఎస్ఐ జ్ఞానప్రసాద్‌లు మాట్లాడుతూ ప్రతి వాహనచోదకుడి వద్ద అన్ని రకాల డాక్యుమెంట్లు ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో లారీ ఓనర్స్ ప్రతినిధులు నంబియార్ వేణుగోపాలరావు, గోనా భాస్కరరావు, ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న భవ్యారెడ్డి


వృక్షాలకు రాఖీలు కడుతున్న విద్యార్థులు

అలజంగిలో వృక్ష రక్షాబంధన్

బొబ్బిలి రూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): అలజంగి ఆదర్శ పాఠశాలలో హెచ్ ఎం మోజేస్ ఆధ్వర్యంలో గురువారం రక్షా బంధన్ వేడుకలు నిర్వహించారు. రక్షా బంధన్ ప్రాధాన్యతను హెచ్‌ఎం విద్యార్థులకు వివరించారు. పాఠశాల ఆవరణలో చెట్లకు విద్యార్థులు రాఖీలుకట్టారు. ప్రజలకు ప్రాణవాయువును అందించే వృక్షాలను రక్షించాలని వృక్ష రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

పెచ్చులూడి.. పెను ప్రమాదం తప్పి

- రామభద్రపురం పశువైద్య కేంద్రంలో భయాందోళనకు గురైన సిబ్బంది

రామభద్రపురం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రామభద్రపురం పశువైద్య కేంద్రంలో పైకప్పు నుంచి గురువారం పెచ్చులూడడంతో పెను ప్రమాదం తప్పింది. గురువారం సిబ్బంది విధులు నిర్వహిస్తున్న సమయంలో ఒక్కసారిగా భవనం పైకప్పు నుంచి పెచ్చులు ఊడిపడడంతో సిబ్బంది భయాందోళన చెందారు. దీంతో ఆ సమయంలో విధుల్లో ఉన్న ఉద్యోగి కాసులమ్మ తప్పించుకోవడంతో ప్రమాదమే తప్పింది. దశాబ్దాల కిందట నిర్మించిన భవనం కావడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరింది. దీంతో ప్రస్తుతం సిబ్బంది బిక్కుబిక్కుమని విధులు నిర్వహిస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి నూతన భవనంమంజూరు చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు.


పెచ్చులూడిన పశువైద్య కేంద్రం పైకప్పు

ముర్రుపాలు బిడ్డకు ఎంతో అమూల్యం

- కలెక్టర్ డా.బీఆర్ అంబేడ్కర్
- ముగిసిన తల్లిపాల వారోత్సవాలు


మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): బిడ్డ పుట్టిన వెంటనే ఐదు నిమిషాల్లోపు తల్లి ఇచ్చే ముర్రుపాలు బిడ్డకు ఎంతో అమూల్యమైనవని కలెక్టర్ డా.బీఆర్ అంబేడ్కర్ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిపాలలో అద్భుతమైన పోషకాలు, ఔషధ గుణాలు ఉంటాయని.. అవి బిడ్డ ఆరోగ్యానికి ఎదుగుదలకు ఎంతో ఉపకరిస్తాయన్నారు. ఐసీడీఎస్, ఇతర శాఖల సమన్వయంతో ముందుగా ఆర్టీసీ కాంప్లెక్స్ కలెక్టరేట్‌లో బ్రెస్ట్ ఫీడింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, డీసీఎంఎస్ ఛైర్మన్ గొంప కృష్ణ, జడ్పీ స్టాండింగ్ కమిటీ ఛైర్‌పర్సన్ శాంతికుమార్, సీడబ్ల్యూసీ ఛైర్మన్ హిమబిందు, ఐసీడీఎస్ పీడీ విమాలారాణి, జడ్పీ సీఈవో సత్యనారాయణ, మెప్మా పీడీ చిట్టిరాజు, సాంఘిక సంక్షేమాధికారిణి అన్నపూర్ణ, బీసీ సంక్షేమాధికారిణి జ్యోతిశ్రీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కవితతో పాటు అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జేసీ సేతుమాధవన్

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

- జేసీ సేతు మాధవన్

విజయనగరం కలెక్టరేట్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నివారణకు అన్నిరకాల చర్యలు తీసుకోవాలని, రహదారులపై ఆక్రమణలు తొలగించాలని జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో జిల్లా స్థాయి రహదారి భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రహదారులు, జంక్షన్లు, బ్లాక్ స్పాట్లు, పాఠశాలల వద్ద ఆక్రమణలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఐఆర్‌ఏడీ యాప్‌లో రోడ్డు ప్రమాదాల వివరాలను నమోదు చేయాలన్నారు. అన్ని శాఖల అవగాహన కోసం జూమ్ మీటింగ్ నిర్వహించాలని సూచించారు. రోడ్లు, భవనాలు, పోలీసు, రవాణా, పంచాయతీరాజ్ శాఖల సంయుక్త బృందాలు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటివరకూ పెండింగ్‌లో ఉన్న కేసులను తక్షణమే పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో ఏఎస్పీ సౌమ్యలత, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ కాంతిమతి, డీసీహెచ్ఎస్ పద్మశ్రీరాణి, నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య, బొబ్బిలి మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి, ఎంవీఐ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాంప్రదాయ దుస్తులతో విద్యార్థుల సందడి

బొబ్బిలి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ సంక్షేమశాఖ కళాశాల బాలికల హాస్టల్‌లో గురువారం ఫ్రెషర్స్‌డే జరుపుకున్నారు. విద్యార్థులంతా సాంప్రదాయ దుస్తులు ధరించి సందడి చేశారు. ముందుగా ఏబీసీడబ్ల్యూవో ఎ.శ్యామలా కుమారి కేక్ కట్ చేశారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. శ్యామలాకుమారి మాట్లాడుతూ విద్యార్థులంతా క్రమశిక్షణతో మెలిగి ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. ఇందుకోసం ప్రణాళికలు వేసుకుని వాటి కోసం పరిశ్రమించాలని హితవు పలికారు. అనుచితమైన, అవాంఛనీయమైన అంశాలకు చాలా దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో వార్డెన్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కాలేజీ బాలికల బీసీ హాస్టల్‌లో కేక్ కట్ చేస్తున్న దృశ్యం

పోస్టాఫీసు చుట్టూ ఖాతాదారుల ప్రదర్శన

శృంగవరపుకోట, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఎస్.కోట పోస్టాఫీస్ చుట్టూ డబ్బుల కోసం ఖాతాదారులు ప్రదర్శన చేస్తున్నారు. రెండు, మూడు రోజులుగా ఇదే పరిస్థితి అని వాపోతున్నారు. ఇటీవల రైతులకు అన్నదాత సుఖీభవ డబ్బులు పోస్టాఫీస్ ఖాతాల్లో పడ్డాయి. ఈ డబ్బులను తీసుకునేందుకు రైతులు ఈ పోస్టల్ కార్యాలయానికి వస్తున్నారు. నెట్వర్క్ ఇబ్బందులతో పేమెంట్లు కావడం లేదని పోస్టల్ శాఖ సిబ్బంది తిప్పి పంపించేస్తున్నారని ఖాతాదారులు వాపోతున్నారు.

రేపు వెంకన్నకు కర్పూర తిరునామం

కొత్తవలస, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): కొత్తవలస పంచాయతీ గిడిజాల రోడ్డులోని గరుడాద్రి కొండపై వెలసిన పద్మావతి గోదా సమేత గరుడాద్రి కల్యాణవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 9న ప్రత్యేక కర్పూర తిరునామం, విశేష అర్చనలు నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఆనందాశ్రమంలో ప్రత్యేక పూజలు

కొత్తవలస, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): కొత్తవలస కుమ్మరి వీధిలో ఉన్న ఆనందాశ్రమంలో కొలువైన అలివేలు మంగ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామికి ఈనెల 9వ తేదీన విశేష పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

నులి పురుగుల నివారణపై అవగాహన కల్పించాలి

కొత్తవలస, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): నులి పురుగుల నివారణపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని కొత్తవలస పీహెచ్‌సీ వైద్యాధికారిణి సీతల్ వర్మ సిబ్బందికి సూచించారు. గురువారం కొత్తవలస పీహెచ్‌సీలో ఆమె సిబ్బంది, ఆశా వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఒకటో సంవత్సరం నుంచి 19వ సంవత్సరం వరకు పిల్లలకు రెండు సార్లు నులిపురుగులకు సంబంధించిన మాత్రలను మింగించాలన్నారు. దీని వల్ల పిల్లల్లో వచ్చే రక్త హీనతను నివారించవచ్చునని తెలిపారు.

ఎస్‌డబ్ల్యూపీసీకి దారి కల్పించారు

సంతకవిటి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని జావాం పంచాయతీలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి రహదారి లేదు. దీంతో పంచాయతీవాసులు చెత్తను రోడ్డు పక్కనే పడేసేవారు. ఈ విషయాన్ని స్థానిక నాయకులు.. ఎంపీడీవో కె.సురేష్ కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన ఆదేశాలతో డిప్యూటీ ఎంపీడీవో ఎన్.శ్రవణ్‌కుమార్ గురువారం జావాం గ్రామాన్ని సందర్శించారు. జంగిల్ క్లియరెన్స్ చేయించాలని పంచాయతీ కార్యదర్శి బి.నరేష్‌కి ఆదేశించారు. వెంటనే ఆయన ఎస్‌డబ్ల్యూపీసీకి వాహనాలు వెళ్లే విధంగా జంగిల్ క్లియరెన్స్ చేయించారు.

16న రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలు

కొత్తవలస, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఈనెల 16వ తేదీన అప్పన్నపాలెం గ్రామంలో రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నట్టు ఉత్తరాంధ్ర జిల్లాల క్విజ్ మాస్టర్ కర్రి రాము తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ముందుగా తమ గ్రూపు పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. విజేతలకు వరుసగా రూ.5వేలు, రూ.4వేలు, రూ.3వేలు, రూ.2వేల చొప్పున బహుమతులు అందజేస్తామని చెప్పారు. ఈ పోటీలకు టీడీపీ విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు తిక్కాన చినదేముడు ఆర్థిక సాయం అందిస్తున్నారని తెలిపారు.

వీధి దీపాలను బాగు చేయండి

విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో పాడైన వీధి దీపాలను మరమ్మతు చేసి, తక్షణమే వెలిగే విధంగా చూడాలని నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ అప్పలరాజు అధికారులను ఆదేశించారు. 43వ డివిజన్, 53వ సచివాలయం పరిధిలో ఆయన గురువారం పర్యటించారు. డివిజన్‌లో ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయో గుర్తించారు. వీధి దీపాలను ప్రాధాన్యతా క్రమంలో మరమ్మతులు చేయాలన్నారు. ప్రతి డివిజన్‌లో అభివృద్ధి పనుల నిమిత్తం రూ.20 లక్షలు కేటాయించామని తెలిపారు. ఏవో సీతారామమూర్తి, టీపీవో అప్పలరాజు పాల్గొన్నారు.

కాలువల పరిశుభ్రతకు ప్రాధాన్యం

విజయనగరం రింగురోడ్డు ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): నగరంలో కాలువల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య తెలిపారు. గురువారం సాకేటి వీధి ప్రాంతంలోని కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగింపజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాకోడు నుంచి ప్రత్యేక పారిశుధ్య బృందాలను రప్పించి ప్రధాన కాలువతో పాటు, చిన్న కాలువల్లో చెత్త ప్రక్షాళన చేపడుతున్నామని చెప్పారు.

అధికారులకు రాఖీ కట్టిన బీవీకే ప్రతినిధులు



జేసీకి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీ

విజయనగరం కల్చరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): బ్రహ్మకుమారి ఈశ్వరీయ విద్యాలయం (బీవీకే) మహిళా ప్రతినిధులు ప్రతి ఏడాది రాఖీ పండుగ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయా లకు వెళ్లి అక్కడ అధికారులు, సిబ్బందికి రాఖీ కడుతుంటారు. ఈ ఏడాది రాఖీ పౌర్ణమి శనివారం సెలవు కావడంతో బ్రహ్మ కుమారీలు గురువారం కలెక్టరేట్‌లోని జిల్లా అధికారులతో పాటు, పోలీసులకు కూడా రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. జేసీ సేతుమాధవన్, మహిళా పోలీసు స్టేషన్ సీఐ నర్సింహమూర్తితో పాటు పలువురికి రాఖీలు కట్టారు.

అర్చకుడి నివాసం కోసమని చెప్పి..

- కోమటి చెరువు గట్టుపై అక్రమ నిర్మాణం
- దుకాణాలుగా మార్చి.. వేలం వేసిన వైనం

ఎస్.కోట రూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఆలయ అర్చకుడి నివాసం కోసమని చెప్పి.. చెరువు గట్టుపై నిర్మాణాలు చేపట్టారు. తర్వాత వాటిని దుకాణాలుగా మార్చి.. వేలం వేశారు. మండలంలోని ధర్మవరం పంచాయతీ మారుతీనగర్‌లో ఆంజనేయస్వామి ఆలయం పక్కన ఉన్న కోమటిచెరువు గట్టును ఇటీవల కొంతమంది ఆక్రమించి, నిర్మాణాలు చేపట్టారు. ఆలయ అర్చకుడి నివాసం కోసం చెరువు గట్టుపై నిర్మాణాలు చేపడుతున్నామని చెప్పుకొచ్చారు. కొద్దిరోజుల తర్వాత వీటిని దుకాణాలుగా మార్చారు. ఆ తర్వాత.. ఇక్కడ రెండు దుకాణాలు నిర్మించాం.. వేలం వేస్తున్నాం.. అని ప్రకటించారు. దీంతో ఆ రెండు దుకాణాలను ఇద్దరు వ్యక్తులు దక్కించుకున్నారు. త్వరలోనే వ్యాపారాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు కూడా చేస్తున్నారు. ఇది చూసిన స్థానికులు.. చెరువు గట్టును ఆక్రమించి, దుకాణాలు నిర్మించడం ఏంటో.. వేలం వేసి, రూ.లక్షలు అడ్వాన్స్ తీసుకుని నెలకు వేల రూపాయలు అద్దెకు ఇవ్వడం ఏంటో అని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

విచారణ చేస్తాం

ధర్మవరం పంచాయతీ పరిధిలోని కోమటిచెరువు గట్టుపై అక్రమ నిర్మాణాలు చేపట్టిన విషయం మా దృష్టికి రాలేదు. వీఆర్వోను పంపించి.. విచారణ చేస్తాం.

- శ్రీనివాసరావు, తహసీల్దార్, ఎస్.కోట



ఆలయం పక్కన చెరువు గట్టుపై నిర్మించిన దుకాణాలు

దశాబ్దాల నాటి సమస్యకు పరిష్కారం

- విశాఖ-అరకు రోడ్డులో కాలువల నిర్మాణానికి భూమిపూజ
- ఎస్.కోట ఎమ్మెల్యే లలితకుమారి

శృంగవరపుకోట, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఎస్.కోట పట్టణంలో దశాబ్ద కాలంగా నెలకొన్న సమస్యకు కూటమి ప్రభుత్వం పరిష్కారం చూపుతోందని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. పట్టణ పరిధిలోని విశాఖ-అరకు రోడ్డుకు ఇరువైపులా రూ.95లక్షలతో చేపట్టనున్న మురుగు కాలువల నిర్మాణానికి ఆమె గురువారం భూమి పూజ చేశారు. ఇక్కడ ఏమాత్రం వర్షం కురిసినా రోడ్డుమీదకు వరద నీరు వచ్చేస్తుండడంతో స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రోడ్డుకు ఇరువైలా ఆక్రమణల కారణంగా ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. ఈ ఆక్రమణలు తొలగించేందుకు ప్రజలు సహకరించడం ఆనందంగా ఉందన్నారు. దేవిబొమ్మ కూడలి నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు కాలువల నిర్మాణం చేపడుతున్నారని తెలిపారు. ఈ కాలువల నుంచి వచ్చే వరద నీరు పుణ్యగిరి గెడ్డకాలవ ద్వారా ఆర్టీసీ కాంప్లెక్స్ పక్క నుంచి కిందకు పోయేవిధంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాణి, సర్పంచ్ గనివాడ సంతోషికుమారి, టీడీపీ మండల అధ్యక్షుడు జీఎస్ నాయుడు, మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, మాజీ వైస్ ఎంపీపీ నానిగిరి రమణాజీ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, నాయకులు భీశెట్టి అరుణ, కొణదం మల్లేశ్వరరావు, కాపుగంటి వాసు, పెదగాడి రాజు, జనసేన నాయకుడు ఒబ్బిన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

రైతులకు అందుబాటులో ఉండాలి

- చీపురుపల్లి ఎమ్మెల్యే కళావెంకటరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావెంకటరావు

మెరకముడిదాం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) సభ్యులు రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు అన్నారు. ఇటీవల సోమలింగాపురం పీఏసీఎస్ నూతన కార్యవర్గం ఎంపిక య్యింది. ఆ గ్రామంలో గురువారం నిర్వహించిన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అన్ని విధాల సహాయ సహకారాలు అందించి సొసైటీని అభివృద్ధి పథంలో నడిపించాలని సూచించారు. పీఏసీఎస్ ఛైర్మన్‌గా సిరివూరి వెంకటపతి రాజు(నాని), డైరక్టర్లుగా రాడ సూర్యనారాయణ, భగీరధీపురం అరసాడ సత్యం ఎంపిక కాగా, వీరితో సొసైటీ సీఈవో రాపాక వెంకట్‌నాయుడు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో గద్దే బాబురావు, టీడీపీ మండల అధ్యక్షుడు తాడ్డి సన్యాసినాయుడు, మండల నాయకులు కోట్ల మోతినాయుడు, భైరిపురం ఏఎంసీ ఛైర్మన్ తాడ్డి చంద్రశేఖర్, శిరువూరు వాసుదేవరాజు, టి.సుబ్బరాజు, డాక్టర్ రామ్మూర్తి రాజు, సీహెచ్.బంగారునాయుడు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సాంకేతికతను వినియోగించుకోండి

ఎస్.కోట రూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో సాంకేతికతను వినియోగించుకోవాలని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. సంతగైరమ్మపేటలో రైతు సంఘానికి మంజూరైన డ్రోన్‌ను ఆమె గురువారం ప్రారంభించారు. అనంతరం స్థానిక శివాలయంలో డ్రోన్‌కు పూజలు చేశారు. ఏవో రవీంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర టూరిజం బోర్డు కార్పొరేషన్ డైరక్టర్ ఇందుకూరి సుధారాజు, టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు జీఎస్ నాయుడు, రామసత్యం, పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ వెంకన్న, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఒబ్బిన సత్యనారాయణ, ఎస్.కోట సర్పంచ్ సంతోష్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు అప్పగించారు

- నూతన ప్రభుత్వ కార్యాలయాల్లోకి సిబ్బంది

ఎస్.కోట రూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పెదఖండేపల్లి గ్రామంలో గత ప్రభుత్వం లక్షల వ్యయంతో నిర్మించి వదిలేసిన సచివాలయ భవనం, రైతుభరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్లను ఎట్టకేలకు ఆయా శాఖల అధికారులకు, సిబ్బందికి అప్పగించారు. గురువారం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ విషయంపై సర్పంచ్ యాళ్ల రమణ మట్లాడుతూ నిర్మించి ఏళ్ల గడుస్తున్నా ఈ కార్యాలయాలు ప్రారంభోత్సవానికి నోచుకోలేదన్నారు. దీంతో ఆయా శాఖల అధికారులు, సిబ్బంది ఇబ్బందులు పడ్డారని చెప్పారు. ఎమ్మెల్సీ ఆధ్వర్యంలో ఎట్టకేలకు వీటిని ఆయా శాఖల వారికి అప్పగించామని ఆయన తెలిపారు. దీంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు.

రండి.. టీ తాగుతూ మాట్లాడుకుందాం

- ఏపీజీఈఏ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమం



టీ తాగుతూ డిమాండ్లు తెలియజేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు

చీపురుపల్లి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించింది. 'రండి.. టీ తాగుతూ మాట్లాడుకుందాం' అనే కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా చీపురుపల్లి శాఖకు చెందిన ఉద్యోగులు స్థానిక సంఘ కార్యాలయం వద్ద గురువారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా సంఘ నాయకులు జి.లక్ష్మునాయుడు, పిన్నింటి హరి, సీహెచ్ ప్రసాద్ తదితరులు మాట్లాడుతూ ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించాలన్నారు. డీఏ, పీఆర్సీ బిల్లులు ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఈ సమావేశంలో కార్యవర్గ సభ్యులు జరజాన అచ్యుతరావు, కె.నాగేశ్వరరావు, వెంకటమ్మ, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన యంగ్ అచీవర్స్ శిక్షణ

ఎస్.కోట రూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒక ప్రైవేటు రిసార్టులో గత మూడు రోజులుగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ కోఆపరేటివ్ బ్యాంకు ఆధ్వర్యంలో జరిగిన యంగ్ అచీవర్స్ ఉత్తరాంధ్ర స్థాయి శిక్షణ కార్యక్రమం గురువారం ముగిసింది. ఇందులో పాల్గొన్న డీసీసీబీ ఛైర్మన్ కిమిడి నాగార్జున మట్లాడుతూ యంగ్ అచీవర్స్ తమ అద్భుతమైన సూచనలు, సలహాలతో సహకార రంగాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

కూటమితోనే సంక్షేమం సాధ్యం

- విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అదితి

విజయనగరం రూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గురువారం విజయనగరంలోని 12, 15, 16, మండల పరిధిలోని రీమాపేట గ్రామంలో ఇంటింటికి వెళ్లి, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నా.. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆయా డివిజన్ల ఇన్‌చార్జులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- విజయనగరంలోని ఎస్‌హెచ్‌జీ గ్రూప్‌లో డిగ్రీ ఆపై అర్హత ఉన్నవారికి డీజిటల్ సేవలు అందించే డీజే లక్ష్మీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు గురువారం స్థానిక మెప్మా కార్యాలయంలో ప్రారంభించారు. ఈ పథకం కింద ఎస్‌హెచ్‌జీ గ్రూప్ సభ్యులకు రూ.2లక్షల రుణాన్ని ప్రభుత్వం మంజూరు చేయనుంది. కంప్యూటర్, స్కానర్‌తో పాటు పలు పరికరాలు అందించనున్నారు.

తల్లి పాలలో ఎన్నో పోషక విలువలు

- నెల్లిమర్ల ఎమ్మెల్యే నాగమాధవి



ఎమ్మెల్యే నాగమాధవి ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతం చేస్తున్న దృశ్యం

భోగాపురం, ఆస్టు7(ఆంధ్రజ్యోతి): తల్లి పాలలో అనేక పోషక విలువలు ఉంటాయని, ఇవి బిడ్డ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. గురువారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. తల్లి తన శిశువుకు పాలు ఇవ్వడం ద్వారా వారిద్దరి మధ్య ఆప్యాయత పెరుగుతుందన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో గాయత్రి, వైస్ ఎంపీపీ పచ్చిపాల నాగలక్ష్మి, నాయకులు పల్లంట్ల జగదీష్, పల్ల రాంబాబు, బొల్లు త్రినాథ్, మాత నవీన్, వందనాల రమణ, గుండపు సూర్యారావు, వరుపుల సుధాకర్, ఏసీడీపీవో ఎల్.సుజాత, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థిరమైన పారిశుధ్య వ్యవస్థ కోసం కృషి



మాట్లాడుతున్న కేంద్ర జలశక్తి ప్రాజెక్టు మోనటరింగ్ యూనిట్ టీం లీడర్ సంజయ్‌కుమార్

రాజాం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): స్థిరమైన పారిశుధ్య వ్యవస్థ కోసం కృషి చేస్తున్నామని కేంద్ర జల్ శక్తి ప్రాజెక్టు మానటరింగ్ యూనిట్ టీం లీడర్ సంజయ్‌కుమార్ తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వి.శ్రీనివాసరావుతో ఆయన సమావేశం అయ్యారు. కేంద్ర జలశక్తి, జీఎంఆర్ ఫౌండేషన్ సంయుక్తంగా స్వచ్ఛభారత్ ఫేజ్-2లో భాగంగా పారిశుధ్య వ్యర్థాల నిర్వాహణ కోసం రాజాం మండలాన్ని ఎంపిక చేసినట్టు తెలిపారు. మెరుగైన పారిశుధ్య నిర్వహణ కోసం, ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రయోగాత్మకంగా 15 రాష్ట్రాల్లో 75 పంచాయితీలను ఎంపిక చేశారన్నారు. దీని కోసం బ్లాక్ స్థాయిలో ఒక స్వచ్ఛ సాతీని నియమిస్తామన్నారు. డిప్యూటీ కన్సల్టెంట్ శృతి మక్కర్, జీఎంఆర్ ఫౌండేషన్ ప్రోగ్రాం మేనేజరు సాయికిషోర్, హెచ్ఆర్డీ కన్సల్టెంట్ టి.సుధాకర్, ఎంపీడీవో వి.శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగన్మోహన్‌రావు, ఎంఆర్సీ వైకుంఠరావు పాల్గొన్నారు.

జిందాల్ నిర్వాసితుల నిరసన



నిరసన చేస్తున్న జిందాల్ నిర్వాసితులు

ఎస్.కోట రూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): గత 45 రోజులుగా నిరసన చేస్తున్నా ఏ ఒక్క అధికారి గానీ, ప్రజాప్రతినిధి గానీ పట్టించుకో వడం లేదని జిందాల్ నిర్వాసితులు వాపోయారు. ఈ మేరకు గురువారం బొడ్డవర గ్రామంలో వారంతా చెప్పుల దండలు వేసుకుని, కొంతమంది ముఖానికి నల్లరంగు పూసుకుని నిరసన తెలిపారు. ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు పూర్వ వైభవం: ఎమ్మెల్యే కోండ్రు

రాజాం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేనేత కార్మికులకు పూర్వ వైభవం వచ్చిందని రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. రాజాంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సొంత మగ్గం కలిగిన చేనేత కార్మికుల ఇళ్లకు 200 యూనిట్లు, పవర్‌లూమ్స్‌కు 500 యూనిట్లు వరకు ఉచితంగా విద్యుత్ అందిస్తున్నారని చెప్పారు. అలాగే చేనేత వస్త్రాలపై విధించే జీఎస్టీని రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. నేత కార్మికులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు.

అన్నివిధాలా ఆదుకుంటాం



ర్యాలీ నిర్వహిస్తున్న చేనేత కార్మికులు

రాజాం రూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): రాజాం ప్రాంతానికి చెందిన చేనేత కార్మికులను అన్నివిధాలా ఆదుకుంటామని జీఎంఆర్ గ్రూప్ చీఫ్ మేనేజర్ జయకుమార్ తెలిపారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా రాజాంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికులకు హెల్త్‌కార్డులు అందజేస్తామని, కేర్ ఆసుపత్రిలో రాయితీతో కూడిన వైద్యం అందజేస్తామని, చదువుకున్న వారి పిల్లలకు ఆర్థికంగా ఆదుకుంటామని తెలిపారు. ఈ ప్రాంతంలో చేనేత కార్మికులు నేసిన వస్త్రాలను మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తామన్నారు. మంచి వస్త్రాలు నేస్తే వాటిని జీఎంఆర్ గ్రూప్‌నకు చెందిన ఎయిర్‌పోర్టుల్లో స్టాల్స్ ఏర్పాటు చేయడం ద్వారా వారి ఉత్పత్తులు అమ్మకం అయ్యేందుకు సహకరిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో పాల్గొన్న చేనేత జౌళిశాఖ ఏడీ మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం చేనేత కార్మికుల ఇళ్లకు సంబంధించి 200 యూనిట్లు, పవర్‌లూంలకు 500 యూనిట్లు విద్యుత్‌ను ఉచితంగా అందజేసేలా నిర్ణయించిందని తెలిపారు. అంతకు ముందు పట్టణంలో చేనేత కార్మికులు ర్యాలీ నిర్వహించారు. చేనేత సంఘ నాయకులు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి

రామభద్రపురం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరికతోట సమీపంలో పంటపొలాల్లో యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. మండలంలోని కొండపాలవలసకు చెందిన లెంక ధనుంజయ(36) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం మొక్కజొన్న పొత్తు లోడు కోసం ట్రాక్టర్‌ను తీసుకువెళ్లాడు. ఆ పక్కనే ట్రాక్టర్‌ను నిలిపివేసి నీలగిరి తోటలోకి వెళ్లాడు. ఇంతలో ఆయన కోసం కుటుంబ సభ్యులు బుధవారం మధ్యాహ్నం నుంచి గురువారం ఉదయం వరకు వెతికారు. గురువారం మధ్యాహ్నం అటువైపుగా వెళ్తున్న కొంతమంది విగతజీవిగా పడి ఉన్న ధనంజయను చూసి బంధువులకు సమాచారం ఇచ్చారు. ముఖంపై గాయాలుకావడం, రక్తం కారుతుండడంతో మృతిపై పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. విజయగనరం నుంచి వచ్చిన క్లూస్‌టీం దర్యాప్తు చేసింది. భార్య లెంక గౌరి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వెలమలప్రసాదరావు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. ధనుంజయకు భార్యతోపాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. భర్త మృతితో ఇద్దరు పిల్లలతో తాను ఎలా జీవించాలని భార్య గౌరి విలపిస్తోంది. తమకు ఏ ఆధారంలేదని, ఆయనపై ఆధారపడి జీవిస్తున్నామని రోదిస్తోంది. ధనుంజయ రాత్రి ఇంటికి రాకపోవడంతో ఉదయం వస్తాడని పిల్లలు ఎదురుచూశారు. తర్వాత పిల్లలు పాఠశాలకు వెళ్లిపోయారు. మధ్యాహ్నం సమాచారం అందడంతో నేరుగా పోలీసు స్టేషన్ దగ్గరకు చేరుకుని భార్య, పిల్లలు విలపించారు.

చికిత్సపొందుతూ వృద్ధుడు..

భామిని, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సతివాడ గ్రామానికి చెందిన పూర్ల లక్ష్మీనారాయణ (65) చికిత్సపొందుతూ మృతిచెందాడు. గ్రామస్థుల కథనం మేరకు.. లక్ష్మీనారాయణ పింఛన్ సొమ్ముతో ప్రతిరోజూ మద్యం తాగి రావడంపై కుమారుడు మందలించాడు. దీంతో ఒడిశా హద్దుబంగిలో ఉన్న కుమార్తె వద్దకు వెళ్లాడు. అక్కడ మందు బాటిల్‌లో పురుగుల మందు కలిపి సేవించి అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన కుమార్తె కుటుంబ సభ్యులు కొత్తూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని శ్రీకాకుళం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ లక్ష్మీనారాయణ గురువారం మృతిచెందాడు. దీనిపై ఎస్‌ఐ అప్పారావు వద్ద ప్రస్తావించగా ఒడిశా గుణుపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తుందని, అక్కడ పోలీసులు పరిశీలిస్తారని చెప్పారు.

యువకుడి ఆత్మహత్య

సీతంపేట రూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): సీతంపేటకు చెందిన నల్లాన శివకుమార్(27) గురువారం సాయంత్రం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. సీతంపేటకు చెందిన నల్లాన వెంకట్, విజయలక్ష్మి కుమారుడు శివకు గత ఏడాది జ్యోతి అనే మహిళతో వివాహమైంది. కుటుంబసభ్యులంతా ఒకే ఇంటిలో కలిసి నివాసముంటున్నారు. గ్రామంలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వహించి శివ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం సాయంత్రం శివకు కుటుంబసభ్యులకు మధ్య చిన్నపాటి ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో క్షణికావేశంలో ఉరివేసుకున్నాడు. ఇది గమనించిన కుటుంబసభ్యులు శివను హుటాహుటిన స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు. క్షణికావేశంతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ వై.అమ్మనరావు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.

నాటు తుపాకీ కలిగిన వ్యక్తి అరెస్టు

వేపాడ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): సోంపురం గ్రామంలో నాటు తుపాకీ కలిగిన వ్యక్తిని పట్టుకుని అరెస్టు చేయడంతో పాటు తుపాకీని స్వాధీనం చేసుకున్నామని వల్లంపూడి ఎస్‌ఐ సుదర్శన్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు గ్రామంలోని గొర్లె ఈశ్వరరావు ఇంట్లో తనిఖీ చేశామన్నారు. ఈ తనిఖీలో ఒక నాటు తుపాకీని గుర్తించామని చెప్పారు. ఈ తుపాకీ ఎక్కడిదని ఈశ్వరరావును ప్రశ్నించగా.. గుడివాడ గ్రామానికి చెందిన రొంగలి బంగారయ్యతండ్రి తాత అనే వ్యక్తి వద్ద నుంచి రూ.4,500కు కొనుగోలు చేసినట్టు తెలిపాడన్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా నాటుతుపాకీ కలిగిఉండడం చట్టరీత్యా నేరమన్నారు. తుపాకీ కలిగి ఉన్నందుకు గొర్లె ఈశ్వరరావును, అమ్మినందుకు బంగారయ్యలను ఎస్.కోట రూరల్ సీఐ అప్పలనాయుడు అరెస్టు చేశారని ఎస్‌ఐ తెలిపారు. అలాగే తుపాకీని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

గ్రామ స్థాయిలో నిఘా ఏర్పాటు చేయాలి

- ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో గ్రామ స్థాయిలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఎస్పీ వకుల్ జిందాల్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన టెలి కాన్ఫరెన్స్‌లో పోలీసు అధికారులతో మాట్లాడారు. నాటుతుపాకీల ఏరివేత, గంజాయి, సారా నియంత్రణ లక్ష్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో ముందుగా గుర్తించిన గిరిజన గ్రామాల్లో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో నాటుతుపాకులు వినియోగించే వ్యక్తుల సమాచారాన్ని సేకరించాలన్నారు. మహిళా సంరక్షణ పోలీసులు దత్తత గ్రామాల పోలీసు సిబ్బంది సేవలను వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఎవరి వద్దనైనా నాటుతుపాకులు ఉన్నట్లయితే స్వచ్ఛందంగా అప్పగించాలన్నారు. పోలీసుల ఆపరేషన్‌లో ఎవరైనా నాటు తుపాకులతో పట్టుబడితే కఠినచర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో ఏఎస్పీ సౌమ్యలత, డీఎస్పీలు శ్రీనివాసరావు, భవ్యారెడ్డి, రాఘవులు, పలువురు సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

వాహనచోదకులకు జరిమానా

బొబ్బిలి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలిలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపిన ముగ్గురికి రూ.10వేలు చొప్పున జరిమానా విధిస్తూ స్థానిక కోర్టు గురువారం జరిమానా విధించినట్లు సీఐ కటకం సతీష్‌కుమార్ తెలిపారు. బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతూ పట్టుబడిన పదిమందికి రూ.500 చొప్పున జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు ఇచ్చారని చెప్పారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి

రాజాం రూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించనున్న నేపథ్యంలో ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా కన్వీనర్ కె.సురేష్ కోరారు. గురువారం రాజాంలో ఆటో డ్రైవర్లతో ఆయన సమావేశమయ్యారు. ఈనెల 11న కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ధర్నాలో జిల్లాలోని ఆటో డ్రైవర్లంతా హాజరు కావాలని పిలుపునిచ్చారు. జీవో నెంబర్ 21ని సవరించి పెనాల్టీలను సవరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యుడు త్రినాథ్, నాయకులు రఘు, మూర్తి, రాజు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

పార్వతీపురం రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆరోగ్యానికి సంబంధించిన కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాంఅధికారి టి.జగన్మోహన్‌రావు సూచించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. గురువారం పెదబొండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ హెల్త్ స్క్రీనింగ్ వివరాలు,డీవార్మింగ్ కార్యక్రమం సన్నద్ధతపై వైద్యసిబ్బందిని ఆరా తీశారు. కార్యక్రమంలో ఎపిడమియాలజిస్ట్‌కె.కౌశిక్, వైద్యాధికారి పీఎల్ గోపాలకృష్ణ, హెచ్ఎం గౌరీశ్వరి, సూపర్‌వైజర్ శంకరరావు పాల్గొన్నారు.

కొత్తవలసలో నాటు తుపాకీ స్వాధీనం

పార్వతీపురం రూరల్, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని రవికోన పంచాయతీలో గల కొత్తవలసలో నివాసముంటున్న కె.సీతారామ్ ఇంట్లో నాటు తుపాకీని పోలీసులు స్వాధీనంచేసుకున్నారు.మండలంలోని అనుమతి లేకుండా తుపాకులు వినియోగిస్తున్న వారిపై కఠిన చర్యలు తప్పవని ఇప్పటికే హెచ్చరించడంతోపాటు పోలీసులు గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేడుతున్నారు.ఈ నేపథ్యంలో పోలీసులు సమాచారం ప్రకారం తనిఖీ చేపడుతున్నారు. ఇందులో భాగంగా గురువారం నిర్వహించిన తనిఖీల్లో సీతారాం ఇంట్లో సింగిల్ బ్యారెల్ నాటు తుపాకీ ఉండడంతో గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సంతోష్ గురువారం రాత్రి తెలిపారు.

నాటు తుపాకులు వినియోగిస్తే చర్యలు

పాలకొండ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి):జంతువులు వేటాడానికి, ఇతర అవసరాలకు నాటు తుపాకులు వినియోగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సీఐ చంద్రమౌళి హెచ్చరించారు. గురువారం వీరఘట్టం, పాలకొండ, సీతంపేట, దోనుబాయి, బత్తిలి పోలీస్‌స్టేషన్ల పరిధిలో పలు గ్రామాల్లో సీఐ ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనుమతి లేకుండా నాటుతుపాకులు ఉంచడం చట్టరీత్యా నేరమని, అటువంటి వారిపై కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయా స్టేషన్ల పరిధిలోని ఎస్ఐలు, ఏఎస్ఐలు, సిబ్బంది ఇంటింటా తిరిగి తనిఖీలు చేపట్టారు. అలాగే వీరఘట్టంలోని ఎస్సీ, బీసీ కాలనీలు, కొండవీధుల్లో గురువారం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. బండి కమలాకర్ వద్ద ఐదులీటర్లు, అరసాడ గౌరమ్మ వద్ద 20 లీటర్లు, గురుబిల్లి గౌరమ్మ వద్ద 80 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. వారిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ కె.సూర్యకుమారి తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది వెంకటరాజు, శేఖర్ బాబు, ఫణీంద్ర, తిరుపతిరావు,బాబూరావు పాల్గొన్నారు.వీరఘట్టం మండలంబల్లగుడ్డిలో ఎస్ఐ జి.కళాధర్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు.

● సీతంపేట రూరల్,ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి):మండలంలోని శిలగాంలో ఎస్ఐ వై.అమ్మనరావు ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి తనిఖీలు చేపట్టారు. ఏజెన్సీలో నాటు తుపాకీల వినియోగంపై సమాచారం మేరకు తనిఖీలు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వట్టిగెడ్డ నీటిని విడిచిపెట్టాలి

కురుపాం(జియ్యమ్మవలస), ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావాడ వట్టిగెడ్డ రిజర్వాయర్ సాగునీటి కుడి, ఎడమ ప్రధాన కాలువల ద్వారా విడిచిపెట్టాలని వైసీపీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం చినమేరంగి శత్రుచర్ల కోటలో విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ఏటా ఆగస్టు మూడు, నాలుగు తేదీల్లో నీటి అధికారులు విడిచిపెట్టే వారని, ఈ ఏడాది ఏడో తేదీ వచ్చినా ఇంతవరకు నీరు విడిచిపెట్టలేదని తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ కోట రమేష్,వైస్ఎంపీపీ గుడివాడ సంపత్‌కుమార్, బలగ వెంకటరమణ, లోలుగు నారాయణరావు, పోల గోవిందరావు, తాడేల మన్మథరావు, బెజ్జిపొరపు మురళి పాల్గొన్నారు.

సాగు నీరందించి రైతులను ఆదుకోవాలి

పాలకొండ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): సాగునీరందించి రైతులను ఆదుకోవాలని అభ్యుదయ రైతు ఖండాపు ప్రసాదరావు పేర్కొన్నారు. తహసీల్దార్ రాధాకృష్ణమూర్తికి వినతిపత్రం అందజేశారు. ఖరీఫ్ ప్రారంభమై రెండు నెలలు దాటినా సాగునీరు అందడం లేదన్నారు. గత జూలై 16న సాగు నీరు విడిచిపెట్టారని, నేటికీ పాలకొండ ప్రాంతానికి అందడం లేదన్నారు.

12న నులిపురుగుల మాత్రల పంపిణీ

పాలకొండ(వీరఘట్టం), ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 91 అంగన్‌వాడీ కేంద్రాలు, 62 ప్రభుత్వ పాఠశాలు, పది ప్రైవేటు పాఠశాలు, రెండు కళాశాలల్లో ఈనెల 12న నులిపురుగుల మాత్రలు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో బి.వెంకటరమణ తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో జాతీయ నులిపురుగుల నిర్మూలనా కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు.కార్యక్రమంలో ఎంఈవో ఆర్.ఆనందరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

● కొమరాడ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): డీవార్మింగ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో ఎస్.రమేష్ కోరారు. గురువారం మండలపరిషత్ కార్యాలయంలో వెలుగు, విద్యాశాఖ ఆధ్వర్యంలో డీవార్మింగ్ కార్య క్రమాలకు సంబంధించిన గోడప త్రికను విడుదల చేశారు. కార్యక్రమమంలో కొమరాడ, కేఆర్‌బీపురం వైద్యులు శిరీష, శామ్యూల్, వెలుగు ఏపీఎం సురేష్‌బాబు, పంచాయతీ విస్తరణాధికారి రాధాకృష్ణ పాల్గొన్నారు.

చేనేత కార్మికులను ఆదుకోవాలి

గుమ్మలక్ష్మీపురం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): చేనేత వస్త్రాలను ధరించి కార్మికులను ఆదుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీవరం కోరారు. గురువారం స్థానిక కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో చేనేతదినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపా ల్ రామయ్య, శ్రీవాణి, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ కల్పన, స్వరూప, తులసి, సత్యారావు, చిన్నారావు, కృష్ణారావు, జమ్మయ పాల్గొన్నారు.

పారదర్శకత కోసమే సామాజిక తనిఖీలు

గరుగుబిల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనుల్లో పారదర్శకతను తెలుసుకొనేందుకే సామాజిక తనిఖీలు చేపడుతున్నామని రాష్ట్ర సామాజిక తనిఖీ ఎస్ఆర్‌పీ ఈదుబిల్లి షన్నపునాయుడు తెలిపారు. గురువారం మండలంలోని రాయిందొరవలస, పెద్దూరు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ తెర్లి యల్లంనాయుడు, కార్యదర్శి బి.అప్పారావు పాల్గొన్నారు.

గరుగుబిల్లిలో ఠాగూర్‌కు నివాళి

గరుగుబిల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): గరుగుబిల్లి శాఖా గ్రంథాలయంలో విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి పురస్కరించుకుని చిత్రపటానికి నిర్వాహకులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎన్.మధుసూదనరావు దేశానికి ఠాగూర్ సేవలను కొనియాడారు.

లక్ష్మీపురంలో ఆయుర్వేద వైద్య శిబిరం

సీతానగరం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి):జ్వరాలు వ్యాపిస్తుండడంతో చర్యలు తీసుకోవాలని బూర్జ ఆయుర్వేద ఆసుపత్రి డాక్టర్ టి.హేమాక్షి కోరారు.లక్ష్మీపురంలో ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు.

సాంకేతిక సిబ్బందికి శిక్షణ

సీతానగరం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం పనులు నిర్వహించే సమయంలో ఎన్ఆర్ఈజీఎస్ యాజమాన్యం రూపొందించిన నూతన యాప్ ద్వారా ఆన్‌లైన్ చేయాలని జేఈఈ సోమేశ్వరరావు తెలిపారుగురువారం సీతానగరంమండల పరిషత్ కార్యాలయంలో బలిజిపేట, సీతానగరం మండలాల టీఏలు, సాంకేతిక సిబ్బందికి ఏపీవో బాలకృష్ణ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు.

ప్రతిభతోనే తగిన గుర్తింపు

గరుగుబిల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి):విద్యార్థులకు ప్రతిభ కనపరిస్తే తగిన గుర్తింపు లభిస్తుందని ఎస్ఐ పి.రమేష్‌నాయుడు తెలిపారు. గురువారం గరుగుబిల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల కళాశాల, పాఠశాల ఆవరణలో విద్యార్థినులకు నాసా ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు.

సీతంపేటలో క్రీడాపోటీలు

సీతంపేట రూరల్,ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): సీతంపేటలోని గిరిజన సంక్షేమఆశ్రమ బాలుర ఉన్నతపాఠశాలలో ఆదివాసీదినోత్సవం పురస్కరించుకుని క్రీడాపోటీలు నిర్వహించారు.పోటీలు ఏపీవో చిన్నబాబు ప్రారంభించారు. స్పోర్ట్స్ ఇన్‌చార్జి జాకబ్ దయానంద్,పీడీలు పర్యవేక్షించారు.



దుగ్గేరులో శిథిలావస్థకు చేరిన షెడ్లు

నిర్వహణ లేక.. షెడ్లు శిథిలావస్థకు చేరి

● క్రయవిక్రయదారులకు తప్పని అవస్థలు ● ఇదీ దుగ్గేరు వారపు సంతలో పరిస్థితి

మక్కువ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని దుగ్గేరులో ప్రతి గురువారం జరిగే వారపు సంతలో గిరిజనులకోసం ఏర్పాటుచేసిన షెడ్లు నిర్వహణ లేకపోవడంతో శిథిలావస్థకుచేరాయి. దీంతో ఇక్కడకు వచ్చే క్రయవిక్రయదారులు ఎండకుఎండి వర్షానికి తడుస్తున్నారు. ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి సుమారు 30 గిరి శిఖర గ్రామాల నుంచి గిరిజనులు తాము పండించిన పంట ఉత్పత్తులను సంతలో విక్రయిస్తున్నారు. అనంతరం తమకు కావాల్సిన నిత్యావసర సరుకులను సంతలో కొనుగోలు చేసుకొంటారు. సంతకు వచ్చే గిరిజనుల విశ్రాంతి కోసం గతంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో షెడ్లను ఏర్పాటుచేశారు. తర్వాత కనీస మరమ్మతులు లేకపోవడంతో షెడ్లు శిథిలావస్థకు చేరాయి. దీంతో గిరిజనులు సమీ పంలోగల పామాయిల్ తోటల్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. చిన్నపాటి వర్షానికే షెడ్లు కారిపోతున్నాయి. దీనికితోడు షెడ్ల గోడలు బీటలు వారి, రేకులు విరిగిపోవడంతో ఏ క్షణంలో కూలిపోతాయోనని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఐటీడీఏ అధికారులు స్పందించి సంతలో విశ్రాంతి షెడ్లు ఏర్పాటుచేయాలని పలువురు కోరుతున్నారు.

ఈ కాలనీలు.. సమస్యల లోగిళ్లు

(ఐదో పేజీ తరువాయి)

చేశారు. అధిక ధరకు భూములు కొనుగోలు అప్పట్లో 1800 మం దికి స్థలాలు కేటాయించారు. తదనంతరం ఇళ్ల నిర్మాణాల విషయంలో అధికారులు హడావుడి చేశారు. సామూహిక శంకుస్థాపనకు పిలుపు నిచ్చారు. ఇళ్ల నిర్మాణం చేపట్టాలని లబ్ధిదారులపై ఒత్తిడి తెచ్చారు. అయితే కేవలం రూ.లక్షా 80 వేలతో పనులు చేపట్టలేక చాలామంది ముందుకు రాలేదు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టకపోతే రద్దు చేస్తామని అధికారులు చెప్పడంతో కొందరు అప్పులు చేసి మరీ గృహ నిర్మాణాలు చేపట్టారు. ఏదేమైనా వైసీపీ ప్రభుత్వం హయాంలో ఇళ్ల నిర్మాణాలు చేసింది కేవలం 321 మంది మాత్రమే. 800 మంది వరకు గృహాలు అసంపూర్తిగా ఉన్నాయి. 598 ఇళ్లు పునాదుల దశల్లోనే ఉన్నాయి. కాలనీ కోసం కోట్లాది రూపాయలతో ప్రత్యేక సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. రహదారికి ఇరువైపులా వీధి లైట్లు సైతం ఏర్పాటు చేశారు. అయితే పట్టణానికి దూరంగా ఆ స్థలాలు ఉండడం.. తాగునీరు కొరత తదితర కారణాలతో చాలామంది ఇళ్ల నిర్మాణాలకు వెనకడుగు వేశారు. ఇదిలా ఉండగా అప్పట్లో జగనన్న కాలనీలో అంతర్గత రహదారుల నిర్మాణానికి వినియోగించిన గ్రావెల్ కోసం రూ.కోటి వరకు వెచ్చించారు. అయితే ప్రస్తుతం ఆ రోడ్లు పంట పొలంగా దర్శనమిస్తున్నాయి. వాస్తవంగా కాలనీ స్థలాలు కేటాయించిన పై భాగంలో పంట పొలాలు ఉన్నాయి. అయితే వర్షాకాలంలో పంట పొలాల నుంచి వచ్చే వరదనీరు నేరుగా కాలనీలోకి చేరుతుంది. దీంతో జనన్న కాలనీ బురదమయంగా మారడంతో రాకపోకలు సాగించలేని పరిస్థితి ఏర్పడుతోంది. మరోవైపు అధిక శాతం ఇళ్లు నిర్మాణం కాకపోవడంతో పిచ్చిమొక్కలతో నిండిన ఆ ప్రాంతం అడవిని తలపిస్తోంది. తరచూ విషసర్పాలు, పురుగుల బారిన పడుతున్నామని అక్కడున్న కొంతమంది కాలనీవాసులు వాపోతున్నారు.

ఆ పనులు పూర్తయితేనే..

పాలకొండలో నాన్ అమృత పథకం పనులు పూర్తయితేగానీ జగనన్న కాలనీకి తాగునీరందే పరిస్థితి లేదు. కాగా సదరు కాంట్రాక్టర్ పాలకొండ నుంచి జగన్నన కాలనీకి తాగునీటి పైపులైన్ వేశారు. కుళాయిలు వేసి ట్యాప్ బిగించారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టని చోట కుళాయిలు వేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం కాలనీలోని ఆ కుళాయిల చుట్టూ పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయి.

మరికొన్నిచోట్ల ఇలా..

వెలగవాడ పంచాయతీలో పాలకొండ-సీతంపేట రహదారి పక్కనే పలువురు లబ్ధిదారులకు ఇళ్ల సలాలు కేటాయించారు. అయితే ఆ స్థలాల్లో డంపింగ్‌యార్డుగా ఉపయోగిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన మరో కొంతమంది లబ్ధిదారులకు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఓ కొండపక్కన ఇళ్లసలాలు మంజూరు చేశారు. అవి నివాస యోగ్యంగా లేకపోవడంతో అక్కడెవరూ ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేదు.

కూటమి ప్రభుత్వంపైనే ఆశలు...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇళ్ల స్థలాల కేటాయింపునకు దరఖాస్తులు ఆహ్వానించింది. ఈ మేరకు గ్రామీణ ప్రాంతాల్లో నివసించేవారికి మూడు సెంట్లు, పట్టణ ప్రాంత ప్రజలకు రెండు సెంట్లు ఇస్తున్నట్టు ప్రకటించింది. మరోవైపు వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇళ్ల సలాలు తీసుకున్న లబ్ధిదారులను కూడా పరిగణనలోనికి తీసుకొని న్యాయం చేస్తామని వెల్లడించింది. దీంతో మన్యం వాసుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. కూటమి ప్రభుత్వంపైనే కొండంత ఆశలు పెట్టుకున్నారు.

ఇళ్ల నిర్మాణాలకు చర్యలు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలకు చర్యలు తీసుకుంటాం. అసంపూర్తిగా, పునాదులతో దర్శనమిస్తున్న ఇళ్లకు చెందిన లబ్ధిదారులను గుర్తిస్తాం. గృహ నిర్మాణాలకు అవసరమైన నిధులు కేటాయిస్తాం.

- యు.సుధారాణి, హౌసింగ్ ఏఈ

గిరిజన విద్య మిథ్య

(ఐదో పేజీ తరువాయి)

ఏర్పాటు చేయాలని ఈ ఏడాది మార్చిలో మండల విద్యాశాఖాధికారి జిల్లా గిరిజన ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు. దీనిపై ఇంతవరకు ఎలాంటి స్పందనలేదు. దీంతో ఈ గ్రామ విద్యార్థులు మూడు కిలోమీటర్ల దూరంలో కొండ దిగువన ఉన్న గోర్లివలస పాఠశాలకు నడిచివెళ్లి చదువుకుంటున్నారు. రానుపోను వారు ఆరు కిలోమీటర్లు కొండ దిగి ఎక్కాల్సి వస్తుంది. దీనిపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ స్పందించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. జిల్లా అధికారులు నివేదిక ఇచ్చినా ఇంకా చర్యలు చేపట్టలేదు.

● పీటీ మండ పంచాయతీ చాపరాయిగూడ పాఠశాలలో 28 మంది విద్యార్థులు ఉన్నారు. ఒక్క సీఆర్‌టీతోనే ఈ పాఠశాలను నడుపుతున్నారు. నిబంధనల ప్రకారం ఇక్కడ మరొక ఉపాధ్యాయుడును నియమించాల్సి ఉంది. కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి స్పందించి చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

● డంగభద్ర పంచాయతీ డంగభద్రవలసలో గతంలో పాఠశాల ఉండేది. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని గతేడాది ఏప్రిల్‌లో పాఠశాలను అధికారులు ఎత్తేశారు. ప్రస్తుతం ఈ గ్రామంలో చదువు వయసు గల పిల్లలు ఎక్కువ మంది ఉన్నారు. కానీ, పాఠశాల లేకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టిలో ఉంది

పీటీమండ ఆశ్రమపాఠశాలలో పరిస్థితి ఉన్నతాధికారుల దృష్టిలోఉంది. వారి ఆదేశాలకోసం ఎదురుచూస్తున్నాం.ప్రస్తుతం ఇద్దరితో పాఠశాలను నడపడం కష్టంగానే ఉంది.

-కె.సుగ్రీవులు, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం, టీడబ్ల్యూఏ హెచ్ స్కూల్, పీటీ మండ

సీఆర్‌టీలను నియమిస్తాం

పీటీ మండ పాఠశాలలో పరిస్థితి మా దృష్టిలో ఉంది. కొత్తగా అవసరమైన సీఆర్‌టీలను నియమిస్తాం. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తాం.

-కె.చంద్రబాబు, ఏటీడబ్ల్యూవో, కురుపాం సబ్ డివిజన్

విద్యపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

● రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు కాంతారావు



పాలకొండ బాలికల పాఠశాలలో వంటలను పరిశీలిస్తున్న కాంతారావు

పాలకొండ/వీరఘట్టం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఆరోగ్యం అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు బి.కాంతారావు తెలిపారు. గురువారం పట్టణంలోని రేషన్ డిపోలు, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీలు చేశారు. జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు తీరును పరిశీలించారు. భోజనం నాణ్యతను పరిలిశించి సాంబారులో పప్పు సరైన మోతాదులో లేకపోవడంతో నాణ్యత పెంచాలని, లేకపోతే భవిష్యత్‌లో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీరఘట్టం మండల పరిధిలో రేషన్ డిపోలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రజా పంపిణీ వ్యవస్థ నిత్యావసర సరుకుల పంపిణీను తనిఖీచేశారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనివాస్, విద్యాశాఖాధికారి రమాజ్యోతి, తూనికల విభాగం, ఫుడ్‌సేఫ్టీ, చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్, బీసీ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు, తహసీల్దార్ పాల్గొన్నారు.

సామూహిక వంట విధానం రద్దు చేయాలి

గరుగుబిల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో సామూహిక వంట విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బీవీ రమణ డిమాండ్ చేశారు. గురువారం గరుగుబిల్లిలో భోజన నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక చోట వంటలు నిర్వహించి విద్యార్థులకు పంపిణీ చేసే ఆలోచనను విరమించుకోవాలన్నారు. నిర్వాహకులకు కనీస వేతనాలు చెల్లించి ఉపాధికి భద్రత కల్పించాలన్నారు. ఈ నెల పదో తేదీన పార్వతీపురంలో మధ్యాహ్న భోజన నిర్వాహకులు జిల్లా మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు.అనంతరం భోజన నిర్వాహకుల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండలాధ్యక్షురాలిగా పి.పావని, కార్యదర్శిగా బి.మణికుమారి, ఉపాధ్యక్షులుగా బి.నారాయణమ్మ, ఎం.గౌరమ్మ, సహాయ కార్యదర్శులుగా వి.సరళ, టి.పార్వతి, కోశాధికారిగా బి.లక్ష్మితో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రతినిధులు డి.వెంకటనాయుడు, కె.జగ్గారావు, పావని, అన్నపూర్ణమ్మ, మణికుమారితోపాటు పలువురు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల నష్టాన్ని వివరించండి

● జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ శ్రావణ్‌కుమార్‌నాయుడు

గరుగుబిల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రసాయన ఎరువులు వినియోగంతో కలిగే నష్టాలను వివరించాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ ఎం. శ్రావణ్ కుమార్‌నాయుడు కోరారు. గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలని తెలిపారు. గురువారం తోటపల్లిలోని జట్టు కార్యాలయ ఆవరణలో సిబ్బందికి నెలవారీ ప్రణాళికలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అందు బాటులో ఉండే సహజ సామగ్రితో పంటలకు సస్యరక్షణ చేసేలా దృష్టి సారించాలన్నారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించే పంటలపై అవగాహన కల్పిస్తే రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు. ప్రభుత్వం ప్రకృతి వ్యవసా యానికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. అనంతరం సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఏ జి.అన్నపూర్ణ పాల్గొన్నారు.

సాలూరు మునిసిపల్ కమిషనర్‌గా రత్నకుమార్

సాలూరు రూరల్,ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): సాలూరు మునిసిపల్ కమిషనర్‌గా టీటీ రత్నకుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ కమిషనర్ సీజే రామ్ ఏసీబీకి పట్టుబడడంతో ఇప్పటి వరకు డీఈ బీవీ ప్రసాద్ ఇన్‌చార్జి కమిషనర్‌గా పనిచేశారు. గతంలో జీవీఎంసీలో ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా పనిచేసి బదిలీ అయ్యి పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న టీటీరత్నకుమార్‌ను సాలూరు మునిసిపల్ కమిషనర్‌గా ప్రభుత్వం నియమించింది. ఆయనకు డీఈ ప్రసాద్ ఉద్యోగులు అభినందించారు.ఈ సందర్భంగా రత్నకుమార్ మాట్లాడుతూ అందరి సహకారంతో సాలూరు పట్టణాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

దుర్భిలిలో రేషన్ పాయింట్ ఏర్పాటుచేయాలి

కురుపాం, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలో రేషన్ పాయింట్ ఏర్పాటుచేయాలని దుర్భిలి గ్రామస్థులు కోరారు.ఈ మేరకు గురువారం తహసీల్దార్ కె.జయకి సర్పంచ్ పి.అజారి ఆధ్వర్యంలో యస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్, గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కురుపాం వెళ్లి రేషన్ తెచ్చుకోవడానికి ఏడు గ్రామాల్లోని 236 గిరిజన కుటుంబాలు ఇబ్బందులుపడుతున్నాయని తెలిపారు.

కురుపాంలో 'సుపరిపాలనలో తొలి అడుగు'

కురుపాం,ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): కురుపాంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానిన గురువారం టీడీపీ మండల కన్వీనర్ కె.వి.కొండయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగాతెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్‌కుమార్ ఇంటింటికి వెళ్లి ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఇప్పటికే అమలు చేసిన పథకాలను వివరించారు.

భోజన విరామ సమయంలో నిరసన

సాలూరు రూరల్(సాలూరు), ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది గురువారం ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాలుగు నెలలుగా సాధారణ బదిలీలు, ఇతర సమస్యలపై ఉన్నతాధికారులు ఉదాసీనంగా ఉండడాన్ని నిరసిస్తూ నల్లబ్యాడ్జీలు ధరించి భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో జి.శ్రీను, ఎ.రాంబాబు, కె.చిరంజీవి, బి.విజయభారతి, త్రినాథ్ తదితర అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నారాయణపురంలో చేనేత దినోత్సవం



నారాయణపురంలో ర్యాలీ చేస్తున్న చేనేత కార్మికులు

బలిజిపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపురంలో జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకుని గురువారం నేత కార్మికులను నిర్వహించారు. తొలుత చేనేత వస్త్రధారణ వల్ల ప్రయోజనాలు వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేత, జౌళిశాఖ సహాయ అభివృద్ధి అధికారి ఎన్.వెంకటరమణ చేనేత కార్మికులకు ప్రభుత్వం నుంచి అందుతున్న రాయితీలను వివరించారు.కార్యక్రమంలో డిజైనర్ ప్రసాద్, వెంకటేష్, చేనేత సంఘం మాజీ అధ్యక్షుడు నారాయణరావు, కొండక అప్పారావు, కాలేపు వీర్రాజు పాల్గొన్నారు.

పోలీసుల సంక్షేమానికి ప్రాధాన్యం

బెలగాం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : అహర్నిశలు విధుల్లో నిమగ్నమై ఉండే జిల్లా పోలీస్ సిబ్బంది సమస్యలు పరిష్కరించడమే లక్ష్యమని ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి తెలిపారు. పోలీసుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు.గురువారం జిల్లా పోలీస్ సిబ్బంది, అధికారులతో వీడియాకాన్ఫరెన్స్ ద్వారా వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌డీపీవో, సర్కిల్ కార్యాలయం, పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది సమస్యలు విన్నవించారు.

176 మందికి క్యాన్సర్ స్క్రీనింగ్

బెలగాం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : పార్వతీపురంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆసుపత్రి అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో 176 మందికి ఉచితంగా క్యాన్సర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. క్యాన్సర్‌స్క్రీనింగ్ పరీక్షలను సూపరింటెం డెంట్ శివనాగజ్యోతి పర్యవేక్షించారు. కార్యక్రమంలో డీసీహెచ్ జి.నాగభూషణరావు, వైద్యులు హారిక, కె.పాల్, టెక్నీషియన్ లక్ష్మి, ఎం.దినేష్, శైలజ, శ్యామ్ పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో ప్రతిభచూపిన యశస్విని

పాలకొండ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జోనల్ స్థాయిలో వ్యాసరచన పోటీలో పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విద్యార్థిని అడపా యశస్విని ప్రతిభ చూపి ద్వితీయస్థానంలో నిలిచింది. శ్రీకాకుళంలో ఈనెల ఒకటో తేదీన సమాచార హక్కు చట్టం-2005పై ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రథమ స్థానం సాధించింది. విశాఖలోని డాక్టర్ వీఎస్.కృష్ణ డిగ్రీ, పీజీ కళాశాలలో జరిగిన జోనల్ స్థాయి వ్యాసరచన పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచింది.ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ శ్యాంబాబు యశస్విని అభినందించారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకొండ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నవగాం, తెట్టంగి, తలవరం, బిటివాడ, ఎం.సింగుపురం, తుమరాడ తదితర గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ కె.విష్ణుమూర్తి పేర్కొన్నారు. 33 కేవీ నిర్వహణ పనులు నిమిత్తం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

శక్తియాప్‌పై అవగాహన

పాలకొండ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెంకమ్మపేట కాలనీలోని ఎంపీయూపీ స్కూల్‌లోమహిళలు, బాలబాలికలకోసం రూపొందించిన శక్తియాప్‌పై పాలకొండ శక్తిటీం ఆధ్వర్యంలో గురువారం అవగాహన కల్పించారు. ఆపదలో ఉన్న సమయంలో 112 సెంటర్‌కు కాల్ చేసి తక్షణసాయం పొందాలని హెడ్ కానిస్టేబుల్ ప్రకృతాంబ తెలిపారు.

● కురుపాం,ఆగస్టు7(ఆంధ్రజ్యోతి):శక్తి యాప్ మహిళలకు భద్రతకు రక్షణ కవచమని ఏఎస్ఐ లంకా శ్రీనివసరావు తెలిపారు. గురువారం కురుపాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు.

గ్రీవెన్స్‌బాక్స్ ఏర్పాటు

పాలకొండ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పాలకొండ నగర పంచాయతీ పరిధిలోని సీతంపేట రోడ్డులోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రజల సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ బాక్సును గురువారం ఏర్పాటు చేశారు.సమస్యలను తెల్లకాగితంపై రాసి బాక్సులో వేయాలని క్యాంప్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. గ్రీవెన్స్‌లో ఉన్న సమస్యలను ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ నేరుగా చదివి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు.

పాలకొండలో వర్షం

పాలకొండ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పాలకొండలో గురువారం వర్షం కురిసింది. పదిరోజులుగా ఎండ తీవ్రత, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు సాయంత్రం వర్షం కురవడంతో ఊరట లభించింది. ఏకధాటిగా గంటన్నరపాటు వర్షం కురవడంతో వరి పైరుకు ఉప యోగకరమని రైతులు తెలిపారు. పట్టణంలో కురిసిన వర్షానికి వర్షపు నీరు ప్రధాన రహదారులపై పొంగి పొర్లింది. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతోనే వాహనచోదకులు, పాదచారులు ఇబ్బందులకు గురయ్యారు.

ఎరువుల అవసరాలను గుర్తించాలి

పార్వతీపురం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఎరువుల అవసరాలను ముందుగా గుర్తించాలని, పటిష్ట పర్యవేక్షణ జరగాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు. పీ-4, ఎరువులు, డాక్యుమెంటేషన్ అప్‌లోడ్ జిల్లాల్లో మౌలిక సదుపాయాలు కల్పన తదితర అంశాలపై గురువారం కలెక్టర్‌తో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. కార్య క్రమంలో కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్, జేసీ శోభిక, డీఆర్వో హేమలత, డిప్యూటీ కలెక్టర్ దిలీప్ చక్రవర్తి, డ్వామా పీడీ రామచం ద్రరావు, డీఆర్‌డీఏ ప్రాజెక్ట డైరెక్టర్ ఎం.సుధారాణి పాల్గొన్నారు.